సాక్షి సిద్దిపేట
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



అగ్గిరేగితే.. ఆపేదెలా?

వేసవి కాలం ఎండలు ప్రారంభమయ్యాయి. అగ్ని ప్రమాదాలకు ఎక్కువగా అవకాశం ఉండేది ఇప్పుడే. ఎక్కడైనా అగ్గి రేగితే ఆస్తులు బూడిదకావాల్సిందే. వివరాలు 8లో ▸



మాయమాటలతో దోచేస్తున్నారు

పార్ట్ టైం జాబ్, సెల్ టవర్ ఇన్‌స్టాల్ చేస్తామని, హౌజింగ్ లోన్లు ఇస్తామని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి మాయ మాటలతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. వివరాలు 8లో ▸



లింగాకర్షక బుట్టలతో...

రైతులు మొగిపురుగు ఉధృతిని తెలుసుకోడానికి లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వృత్తి, వ్యాపార లైసెన్సులు తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని దుకాణ యజమానులు వృత్తి, వ్యాపార లైసెన్సులను తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24కు సంబంధించిన వృత్తి వ్యాపార లైసెన్సులు ఏప్రిల్ 2023న తీసుకోవాల్సి ఉండగా.. కొందరు నిర్లక్ష్యం చేస్తూ వ్యాపారాలను కొనసాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. వ్యాపార లైసెన్సును తీసుకొని సిబ్బందికి సహకరించాలని కోరారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు బందోబస్తు

ఏసీపీ సతీశ్



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: పట్టణ శివారు, అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి శివారులో బుధవారం నుంచి జరిగే సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించే ప్రదేశాలను మంగళవారం ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్, ఎస్ఐ వివేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ హుస్నాబాద్ డివిజన్ పరిధిలో 8 ప్రదేశాల్లో సమ్మక్క సారలమ్మ జాతర జరుగుతుందన్నారు. జాతరకు వచ్చే ప్రజలు పోలీస్‌ల సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవార్లను దర్శించుకోవాలని సూచించారు. పోలీస్‌లు సూచించిన ప్రదేశంలోనే వాహనాలను నిలపాలని, భక్తులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని ఏసీపీ సతీశ్ హెచ్చరించారు.

ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్‌ను కలిసిన ఏసీపీ

గజ్వేల్‌రూరల్: స్థానిక కోర్టులో ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య, అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రియాంకను మంగళవారం గజ్వేల్ ఏసీపీ బాలాజీ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసుల గురించి, వచ్చే నెల 9న జరిగే లోక్ అదాలత్‌పై చర్చించారు. కోర్టు ఎదుట రోడ్డుపై వాహనాలు వేగంగా వెళ్తున్నాయని బార్ అసోసియేషన్ సభ్యులు ఏసీపీ బాలాజీ దృష్టికి తీసుకువచ్చారు. చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

రూ.56.03 లక్షలు

మల్లన్న 5వ వారం ఆదాయం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో 5వ వారం వరకు బుకింగ్ ఆదాయం రూ.56,03,330లు సమకూరినట్టు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. శనివారం రూ.3,88,220; ఆదివారం రూ.35,93,622, సోమవారం రూ.16,21,088 లక్షలతో కలిపి మొత్తం మూడు రోజుల్లో బుకింగ్ ఆదాయం రూ.56,03,330 సమకూరిందని తెలిపారు. స్వామివారికి వివిధ రకాల మొక్కుబడులు, దర్శనాలు, లడ్డు ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం లభించినట్టు బుకింగ్ ఇన్‌చార్జి మాధవి తెలిపారు.

రాజ్యసభ సభ్యుడిని కలిసిన ఆలయ చైర్మన్



అనిల్‌కుమార్‌కు స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న లక్ష్మారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్‌కుమార్ యాదవ్‌ను కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆలయ వర్గాలతో కలసి మంగళవారం ఆయన నివాసంలో మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనిల్‌కుమార్ యాదవ్ స్వామికి మంచి భక్తుడని ఆయన త్వరలో నియామకపత్రం అందుకోనున్న నేపథ్యంలో స్వామి తీర్థ ప్రసాదం, ఆశీర్వచనాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆలయ అర్చకులు ఉన్నారు.

బకాయిల బండ

రూ.306కోట్ల రుణాలు

- ఎన్‌పీఏలోకి 45వేల అకౌంట్‌లు
- మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్
- వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం

బ్యాంక్ నుంచి రుణాలు తీసుకుని చెల్లించకపోవడంతో మొండి బకాయిలు పేరుకు పోతున్నాయి. రుణాలకు కనీస వడ్డీ కూడా చెల్లించక పోవడంతో ఖాతాలను ఎన్‌పీఏ (నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్స్)గా బ్యాంక్ అధికారులు గుర్తిస్తున్నారు.



సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా 45,418మంది ఎన్‌పీఏ ఖాతాదారులున్నారు. వారి రుణ బకాయిలు సుమారు రూ.306కోట్లు. ఆయా రుణగ్రహీతలకు భవిష్యత్తులో ఏ బ్యాంకులూ రుణాలు ఇవ్వొద్దని నిర్ణయించాయి. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటికే పలు బ్యాంక్‌లు వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇచ్చాయి.

జిల్లా వ్యాప్తంగా రూ 8,208 కోట్ల రుణాలు

జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు 4,09,085 మంది ఖాతాదారులకు రూ.8,208 కోట్ల రుణాలను అందించాయి. అందులో క్రాప్‌లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలు 2,75,688 మందికి రూ.4,156 కోట్లు ఇచ్చారు. ఇతర రుణాలు రూ.4,052 కోట్లు ఇచ్చారు. రుణాలు తీసుకున్న వారు వాయిదాల పద్ధతుల్లో చెల్లించడం, ప్రతి ఏడాది మిత్తి చెల్లించి రెన్యూవల్ చేయించుకున్న వారికి పలు బ్యాంక్‌లు బోనస్‌లు సైతం అందిస్తున్నాయి. చెల్లించని వారిని ఎన్‌పీఏలో చేరుస్తున్నారు.

ఎన్‌పీఏలోకి 45వేల బ్యాంక్ ఖాతాలు

జిల్లా వ్యాప్తంగా 30బ్యాంక్‌లకు సంబంధించి 151శాఖలు ఉన్నాయి. ఆయా శాఖల్లో 14,91,787 మంది ఖాతాదారులున్నారు. బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించకపోవడంతో వారి ఖాతాలు ఎన్‌పీఏలోకి వెళ్తున్నాయి. జిల్లాలో రూ.306 కోట్ల బకాయిలకు చెందిన 45,418 మంది ఖాతాలను ఎన్‌పీఏలో చేర్చారు.

లోక్ అదాలత్‌లో సెటిల్ మెంట్

మార్చి 9న జాతీయ నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రుణాలను సెటిల్‌మెంట్ చేసుకునే అవకాశాన్ని బ్యాంక్‌లు ఖాతాదారులకు కల్పించనున్నాయి. ఇప్పటికే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం కల్పించాయి. పలు బ్యాంక్‌లు రాయితీలు సైతం ఇస్తున్నాయి.

రైతులకు ఇబ్బందులు

31,582 మంది రైతులు రూ.186కోట్లు, ఎంఎస్ఎంఈ స్కీంలో 2,385 మంది రుణాలు తీసుకొని సుమారుగా రూ.20కోట్లు బకాయి పడ్డారు. అలాగే వివిధ వర్గాల వారు రూ.100 కోట్లు బకాయి పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తే సుమారుగా రూ.150 కోట్ల వరకు బకాయిలు తీరనున్నాయి. రైతుల ఖాతాలు ఎన్‌పీఏలోకి వెళ్లడంతో బ్యాంక్ లావాదేవీలు చేయడం పలువురు రైతులకు కష్టంగా మారింది.

బకాయిలు లేకుండా చూసుకోవాలి



బ్యాంక్‌ల నుంచి రుణాలు పొందిన వారు బకాయిలు లేకుండా చూసుకోవాలి. దీర్ఘకాలిక బకాయిలు వెంటనే చెల్లించాలి. రుణాలు చెల్లించనివారిని ఎన్‌పీఏలో చేరుతారు. దీంతో ఏ బ్యాంక్‌లు రుణాలు ఇవ్వలేవు. పలు బ్యాంక్‌లు ఇస్తున్న వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. రుణాలు చెల్లించిన వారి బ్యాంక్ సిబిల్ స్కోర్ 60 రోజుల్లో పెరుగుతుంది.

– సత్యజిత్, లీడ్ బ్యాంక్ మేనేజర్



ప్రజావాణిలో వినతి ప్రతం అందజేస్తున్న గ్రామస్తులు

ప్రజావాణికి ఖమ్మంపల్లి కబ్జా

వినతి పత్రం అందజేత

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులోని జరుగుతున్న కబ్జాలపై స్పందించని రెవెన్యూ అధికారులపై హైదారాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. మర్పడ్గ పంచాయతీ రెవెన్యూ పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులో సర్వే నంబరు1060, 1061లలో సుమారు 130ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో సుమారు 10ఎకరాల భూమిని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తూ హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. హద్దులు చూపడంలో అధికారులు జాప్యం చేశారు. దీంతో గ్రామస్తులు 10ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని డబుల్ బెడ్రూంలు, ధాన్యం కొనుగోలు కేంద్రం, చెత్త డంపింగ్ షెడ్డుల కోసం ఉపయోగించుకునేలా తీర్మానించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ద్వారా అప్పటి మంత్రి హరీశ్ రావు, కలెక్టరు వెంకటరామిరెడ్డి అండదండలతో భూమిని రికార్డులో ఎక్కించుకునే ప్రయత్నాలు చేశారనే విమర్శలున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గ్రామస్తులు ఇటీవల గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన స్పందించి పూర్తిస్థాయిలో ఎంక్వైరీ చేసి పక్కా హద్దులు చూపాలని ఫోన్‌ద్వారా తహసీల్దార్‌కు సూచించారు. ఈ క్రమంలో వారం రోజుల కిందట హద్దులు చూపడానికి ఆర్ఐ బాలకిషన్, సర్వేయర్ శేఖర్ గ్రామానికి వస్తున్నామంటూ ఫోన్‌చేసి కూడా రాకపోవడంపై గ్రామస్తుల్లో పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో ఎంపీటీసీ యాదగిరితో పాటు గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, రఘురాంలు, యాదగిరి, శేఖర్ కనకయ్య, విష్ణు, సంజీవ్, నరేశ్ హైద్రాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులకు దానిని పంపినట్లు ఎంపీటీసీ యాదగిరి ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని, ప్రభుత్వం స్పందనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ విత్తనాలు వాడి మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

పరిశోధన సంచాలకుడు డా.రఘురామరెడ్డి

సిద్దిపేటరూరల్: రైతులు ప్రైవేట్ కంపెనీ విత్తనాలు వాడి మోసపోవద్దని, యూనివర్సిటీలో తయారైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు రఘురామిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో రైతులకు ప్రొద్దు తిరుగుడు సాగుపై అవగాహన కల్పించారు. జిల్లాలో దాదాపు 8,700 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారన్నారు. పంటలో కలుపు నివారించకపోతే పంట దిగుబడి 50 శాతం తగ్గుతుందని చెప్పారు. పొద్దు తిరుగుడులో వయ్యారిభామ ఎక్కువగా ఉండడంవల్ల పంటకు తెగుళ్లసోకి తక్కువ దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఏ సమస్యలు ఉన్నా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమారాణి, శ్వేత, సరిత, శ్రీజయ, ప్రధాన శాస్త్రవేత్త రమాదేవి, ఏఈఓ ప్రేమ్‌సాయి, బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పొద్దుతిరుగుడు సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డా.రఘురామరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చిన్నకోడూరు, మెట్‌పల్లి గ్రామాల్లో సాగుచేస్తున్న పొద్దు తిరుగుడు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొద్దు తిరుగుడు సాగు తగ్గడానికి గల కారణాలు తెలుసుకున్నారు. పంట దిగుబడి పెరగడంలో విత్తన ఎంపిక, విత్తే పద్ధతి, దూరం, ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, తాలు గింజలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శ్రీదేవి, డా.ఉమారాణి, మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ట్రస్మా ముందంజ

జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ ముందు వరుసలో ఉంటుందని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గుమల్లారెడ్డి చెప్పారు. మంగళవారం ఆయనను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మిగతా పాఠశాలలు కూడా బెస్ట్ అవైలబుల్‌కు దరఖాస్తు చేసుకొనేలా చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ట్రస్మా సంఘం ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు మల్లేశం, బిజుగ రాము, కనకరాజు, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు

ఎరువుల కొరత రావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రోజాశర్మ

- పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి
- జెడ్పీ చైర్మన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: జిల్లాలో యాసంగి పంటకు ఎరువుల కొరత రాకుండా చూడాలని జిల్లా జెడ్పీ చైర్మన్ రోజాశర్మ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశంలో భాగంగా వ్యవసాయ, విద్య, వైద్యంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల చిన్నకోడూర్ మండలంలో 18 దూడల మరణం, ఇన్సూరెన్స్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. సమ్మక్కసారక్క జాతర సందర్భంగా గ్రామాల్లో ప్లాస్టిక్ రహితంగా ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయిల్ ఫ్యాక్టరీ పనులు పూర్తిచేసి త్వరితగతిన వినియోగంలోకి తేవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులను త్వరగా చేపట్టాలని, పదో తరగతి పరీక్షల ఫలితాల్లో సిద్దిపేట జిల్లా మొదటి స్థానం సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'సంకలన' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లెక్చరర్లు

సిద్దిపేట ఎడ్యుకేషన్: 'పర్యావరణ విద్య–సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై గత ఏడాది నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో భాగంగా సమర్పించిన పరిశోధనా పత్రాల సంకలన పుస్తకాన్ని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. యూజీసీ గుర్తింపు పొందిన జర్నల్ ఎడిటర్‌లుగా వ్యవహరించిన కళాశాల అధ్యాపకులు ఈ సంకలనాన్ని రూపొందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ సెమినార్ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వచ్చిన ఆర్టికల్స్‌ను యూజీసీ గుర్తింపు పొందిన జర్నల్లో ఎడిటర్లుగా కళాశాల లెక్చరర్లు సంకలనం రూపొందించడం గర్వకారణమైన విషయం అన్నారు. ఈ విజయాన్ని సాధించిన సెమినార్ నిర్వాహకులు డాక్టర్ సీహెచ్ మధుసూదన్, డాక్టర్ పి.అయోధ్యారెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో విజయాలు సాధించాలని, ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ యస్.మహేందర్, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఈ.శ్రీనివాసరావు, డాక్టర్ రాణి, డాక్టర్ మల్లేశం, విశ్వనాథం, డాక్టర్ జగదీశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో డీఈఓ తదితరులు

జీవితంలో సైన్స్ ప్రభావం అధికం

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటజోన్: జీవితంలో సైన్స్ చాలా ప్రభావితం చేస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీటీసీ భవన్‌లో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు సూర్యతేజ, నాగచైతన్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిర జలప్రభపై ఆశలు

- పథకం పునరుద్ధరణపై సర్కారు యోచన
- డిప్యూటీ సీఎం ప్రకటనతో పేదల్లో హర్షం
- గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో అమలు

బీడుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ భూములను సస్యశ్యామలం చేయదానికి దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అప్పట్లో ప్రవేశపెట్టిన 'ఇందిర ప్రభ' పథకంపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించడంతో పేదల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ పథకం అమలైంది. తిరిగి సమర్థవంతంగా ఈ పథకాన్ని అమలు చేయగలిగితే.. తమకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉందని పేదలు అంటున్నారు.



గజ్వేల్: ఎస్సీ, ఎస్టీల బీడు భూములను సస్యశ్యామలం చేసి వారి జీవితాల్లో వెలుగు నింపడానికి 2005లో 'ఇందిర ప్రభ' పేరిట అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ప్రధానంగా అసైన్డ్ భూములు లేదా దళితుల పట్టా భూములను ఈ పథకం కింద అభివృద్ధి చేసేవారు. సుమారు 10 నుంచి 20 ఎకరాలను యూనిట్‌గా తీసుకొని పది మందికిపై ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గ్రూపుగా ఏర్పాటుచేసి. వారి భూముల్లో బోరుబావులు వేయించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేవారు. పథకం 2009 వరకు బాగానే నడిచింది. వైఎస్ మరణం తర్వాత 2011లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ పథకాన్ని 'ఇందిర జలప్రభ'గా మార్చారు. కానీ పథకం నిర్వహణ సక్రమంగా సాగలేదు. చివరి దశలో ఆర్‌డీఎఫ్(రూరల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఫండ్) 14 కింద ఉమ్మడి మెదక్ జిల్లాలోని అందోల్, గజ్వేల్, మెదక్, నారాయణఖేడ్, నర్సాపూర్, రామాయంపేట, సిద్దిపేట, జహీరాబాద్ క్లస్టర్‌ల పరిధిలో 54,105 ఎకరాలను సాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా 5,082 బోరుబావులను తవ్వించాలని అందుకోసం రూ.58.27కోట్లకుపైగా వెచ్చించాలని నిర్ణయించారు. కానీ అందులో ఇప్పటి వరకు 3,333 బోరుబావులు మాత్రమే వేసి తద్వారా 35,496 ఎకరాలను మాత్రమే సాగులోకి తీసుకురాగలిగారు. మరో 10,214 ఎకరాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది.

నిర్లక్ష్యం.. నిర్వీర్యం..

ఆయా భూముల్లో 973కు పైగా బోరుబావులు వేయాల్సి ఉండగా అది పెండింగ్‌లో పడింది. కానీ పనులు పూర్తిచేసినట్లు అప్పట్లో అధికారులు ప్రకటించినా, 25శాతానికి పైగా బోరుబావుల్లో మోటార్లను అమర్చినా వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వలేదు. కొన్నింటికి విద్యుత్ సరఫరా ఇచ్చినా మోటార్లను బిగించలేదు. పథకం నివేదికల ప్రకారం ఆయా క్లస్టర్ల పరిధిలో ఇంకా 360 బోరుబావులకు విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. నిధుల కొరతను సాకుగా చూపి పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. 2014లో టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్) ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుపై మరింత నిర్లక్ష్యం చేసింది. ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమిని పంపిణీ చేస్తామంటూ బీఆర్ఎస్ ప్రకటించినా నామ మాత్రంగా చేపట్టి చేతులు దులుపుకొని 'ఇందిర జలప్రభ'ను పక్కన పెట్టేసింది.

చిగురిస్తున్న ఆశలు..

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిర జలప్రభ'ను పునరుద్ధరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటన పేదల్లో ఆశలు రేకెత్తేలా చేసింది. ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో భరోసా నింపడానికి ఈ పథకాన్ని పునరుద్ధరిస్తామని కూడా ఆయన ప్రకటించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తరహాలో సమర్థవంతంగా ఈ పథకాన్ని అమలు చేయగలిగితే క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయని పలువురు ప్రముఖులు చెపుతున్నారు. అయితే ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఎలాంటి విధి విధానాలు చేపడుతుందో వేచి చూడాల్సి ఉంది.

క్లుప్తంగా

పంటకు నీళ్లు పెడుతుండగా..

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



శ్రీనివాస్ మృతదేహం

రామాయంపేట(మెదక్): విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన మండలంలోని కాట్రియాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డ్యాగల శ్రీనివాస్ (30)కు భార్య గంగమణితోపాటు ఇద్దరు పిల్లలున్నారు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. పంట చేనుకు నీరు పెట్టడానికి ఉదయం బోరు వద్దకు వెళ్లాడు. కరెంటు మీటర్‌లో ఫీజ్ వైరు వేస్తున్న క్రమంలో వైరుకు చేతి తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి సమీప రైతులు విషయాన్ని గ్రహించి కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాత్రికి తరలించారు.

ఏటీఎం మిషన్ ధ్వంసం



ధ్వంసమైన ఏటీఎం

దుబ్బాకరూరల్: ఏటీఎం మిషన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న ఇండియా వన్ ఏటీఎంను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు. అయితే శబ్దం రావడంతో దుండగులు పరారయ్యారు. సీసీ కెమెరా పుటేజీల ద్వారా దొంగలను గుర్తించామన్నారు. ఏటీఎం నిర్వాహకుడు వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించేవారికి ఓటు

రైతుల ఏకగ్రీవ తీర్మానం



ఏకగ్రీవ తీర్మానం ప్లకార్డ్స్‌తో రైతులు

సిద్దిపేటజోన్: రైతుల ప్రధాన సమస్యల శాశ్వత పరిష్కార హామీ మేనిఫెస్టోలో పెట్టే అభ్యర్థులకు మాత్రమే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేద్దామని సిద్దిపేట జిల్లా రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైతుబజార్‌లో సమావేశం నిర్వహించారు. సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని రైతులతో సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు సమావేశంలో చర్చించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రమాణ స్వీకారం చేసిన రోజు రైతుల సమస్యల పరిష్కారానికి తొలి సంతకం చేస్తామని మాట ఇచ్చే పార్టీని ఎన్నికల్లో గెలిపించాలని పిలుపు ఇచ్చారు. రైతులతో పాటు కౌలు రైతులకు పంట రుణాలను ఇచ్చేలా ప్రత్యేక సౌకర్యం కల్పించాలని కోరారు. పంట నష్ట పోయిన రైతులకు 30 రోజుల్లో నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామలింగారెడ్డి, రవీందర్ రావు, యాదవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో అగ్నిప్రమాదం

జహీరాబాద్ టౌన్: బడంపేట్ అటవీ ప్రాంతంలో మంగళవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించడంతో హుటాహుటినా సిబ్బంది చేరుకొని ఆర్పివేశారు. ఫైర్ ఆఫీసర్ పాలెం ప్రశాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలార్పడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. అగ్నిమాపక కేంద్ర అధికారి మాట్లాడుతూ.. అడవులు, పంట పొలాల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే 87126 99384 లేదా 101 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

అగ్గిరేగితే.. ఆపేదెలా?

- అరకొర వసతుల మధ్య అగ్నిమాపక కేంద్రాలు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- మూడు, నాలుగు కేంద్రాల్లో ఒక్కటే వాహనం..
- నీటి వసతి అంతంత మాత్రమే
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వేసవి కాలం ఎండలు ప్రారంభమయ్యాయి. అగ్ని ప్రమాదాలకు ఎక్కువగా అవకాశం ఉన్నది ఇప్పడే. అయితే ఎక్కడైనా అగ్గి రేగితే ఆస్తులు బూడిద కావాల్సిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాలు అరకొర వసతుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ క్రమంలో అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్ కదిలే వరకు కష్టమే.. ఒకవేళ కదిలినా డ్రైవర్‌ను వెతుక్కోవాలి.. ఫైర్‌మన్లను పిలుచుకోవాలి.. నీటి వనరుల కోసం గాలించాలి.. ఇదంతా జరిగే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి.. డొక్కు వాహనాలతో అగ్ని ప్రమాదాలను నివారించలేని విధంగా జిల్లాలో అగ్నిమాపకశాఖ పరిస్థితి ఉంది. మూడు, నాలుగు కేంద్రాలకు కలిపి ఒక్కటే వాహనం ఉంది. సరైన సిబ్బంది, నీటి వసతి లేదు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అన్ని మండలాల వారీ అగ్నిప్రమాదాల పరిస్థితిపై ప్రత్యేక కథనం...



ఒక్కటే వాహనం..



మెదక్: గతే డాది మార్చి నెలలో మెదక్ మండలం చిట్యాల గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ పెంకుటిల్లుకు నిప్పు అంటుకుంది. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అగ్నిమాపక వాహనాన్ని తీసుకొని హుటాహుటినా గ్రామానికి వెళ్లి మంటలు ఆర్పుతుండగా అదే సమయంలో హవేళిఘనపూర్ మండల కేంద్రంలో ఓ పూరి గుడిసెకు నిప్పు అంటుకుంది. ఒకటే అగ్నిమాపక వాహనం ఉండడంతో చిట్యాలలో మంటలర్పి హవేళిఘనపూర్ గ్రామానికి వెళ్లేలోపల సర్వం అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో రూ. 3.50 లక్షల నగదుతోపాటు ఆస్తి నష్టం వాటిల్లింది. ఇందుకు ప్రధాన కారణం ఒకటే వాహనం ఉండడం. మెదక్ జిల్లా కేంద్రంలో రెండు వాహనాలు ఉన్నప్పటికి ఒకటి పాడైపోయి 10 ఏళ్లు అవుతుంది.

మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట, పెద్దశంకరంపేటలలో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. నాలుగు ఉండగా అన్నింటిలో ఒక్కొక్క వాహనమే ఉంది. ఇందులో ఒక్క రామాయంపేట అగ్ని మాపక కేంద్రంలో మాత్రం అవుట్‌సోర్సింగ్ సిబ్బంది(హోంగార్డులు) ఉండగా మిగితా వాటిలో రెగ్యులర్ సిబ్బందే ఉన్నారు. అన్ని కేంద్రాల్లో మొత్తం 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా మూడు పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. తూప్రాన్ మున్సిపాలిటీలో అగ్నిమాపక కార్యాలయం (కేంద్రం) గతేడాదిన్నర కిందట మంజూరైంది. కానీ నేటికి స్థల సేకరణ జరగలేదు.

ఏళ్లుగా అద్దె భవనంలోనే..

దుబ్బాక: నియోజకవర్గ కేంద్రమైనా దుబ్బాకలో ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్ అసౌకర్యాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఐదేళ్లుగా అద్దె భవనమైనా దుబ్బాక వ్యవసాయ మార్కెట్‌లోనే కొనసాగుతోంది. ఫైర్ ఇంజన్ నిలపడానికి సరైనా స్థలం కూడా లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట గల చెట్ల కింద పెడుతున్నారు. ఫైర్ స్టేషన్ భవనం కోసం దుబ్బాక నుంచి చీకోడ్ వెళ్లే మార్గంలో రైతు రేపాక గోపాల్ రెడ్డి సొంత ఎకరా స్థలం రిజిస్ట్రేషన్ చేసి విరాళంగా ఇచ్చాడు. స్థలం కేటాయించి ఏళ్ల గడుస్తున్నా నిధులు లేక నిర్మాణ పనులు మొదలు కాలేదు. 16 మంది సిబ్బందిలో కేవలం 10 మందిని కేటాయించడంతో ఉన్న వాళ్ల పైనే పని భారం పడుతుంది. సిబ్బంది ఉండడానికి సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని లచ్చపేటకు వెళ్లే మార్గంలో గల మున్సిపల్ బోరుతో, చెరువులు, కుంట వద్ద నీళ్లు నింపుతున్నారు.



దుబ్బాక వ్యవసాయ మార్కెట్‌లో నిలిపిన ఫైర్ ఇంజన్

మున్సిపాలిటీ నీళ్లే గతి..

వట్‌పల్లి (అందోల్): జోగిపేట అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 10 ఫైర్‌మెన్ పోస్టులకు ఐదు ఫైర్‌మెన్ పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి. రెండేళ్లుగా డ్రైవర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. గజ్వేల్ నుంచి డ్రైవర్‌ను డిప్యూటేషన్‌పై నియమించారు. హోంగార్డు కూడా డ్రైవింగ్‌కు వినియోగించుకుంటున్నారు. ఫైర్‌స్టేషన్ ఆవరణలోనే బోరు ఉన్నా డ్రైనేజీ నీరు కలుస్తుండడంతో కంపు వాసన వస్తుంది. మున్సిపాలిటీకి చెందిన ట్యాంకర్‌తో ఫైర్ ఇంజిన్ నింపుకుంటున్నారు. ఇటీవల ఫైర్ స్టేషన్ పరిస్థితి అధికారులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో మిషన్ కాకతీయ కనెక్షన్ ఇచ్చేందుకు అంగీకరించారు. రెండు, మూడు రోజుల్లో ఆ కనెక్షన్ ద్వారా ట్యాంకును నింపుకొని ఫైర్ ఇంజిలోకి వాడుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఫైర్ ఇంజిన్ రిపేరు, ఇతర ఖర్చులకు సంబంధించిన బడ్జెట్‌ను అధికారులు సకాలంలో విడుదల చేయకపోవడంతో వసతులు కల్పించడం లేదు.

తోటలు కాలి బూడిద

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఉన్నా సిబ్బంది, వాహనాల కొరత వేధిస్తోంది. పరిధి ఎక్కువగా ఉన్నా ఫైర్ ఇంజన్ ఒక్కటే ఉంది. దీంతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలతోపాటు అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాలకు జహీరాబాద్ అగ్నిమాపక కేంద్ర సేవలను అందిస్తుంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు, అధిక విస్తీర్ణంలో చెరకు తోటలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం అగ్నిప్రమాదాలు చోటు చేసుకొని తోటలు కాలిబూడిదవుతున్నాయి. ఉన్న వెహికిల్ సమకూర్చి సుమారు 20 ఏళ్లు అవుతుంది. పరిధిని బట్టి అదనంగా మరో ఫైర్ ఇంజన్ వెహికిల్ సమకూర్చాల్సిన అసరం ఉంది. రెండు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బందిలో ఒకరు డిప్యూటేషన్‌పై మరొకరు డ్రైవర్ డ్యూటీ చేస్తున్నారు. ఫైర్‌మెన్ పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయి. సంవత్సరాల తరబడి పోస్టులను భర్తీ చేయడంలేదు.

నీటి సదుపాయం కరువు



పెద్దశంకరంపేటలోని ఫైర్ స్టేషన్

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట లోని అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 2015లో మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేశారు. 16 పోస్టులకు గాను ఒక ఫైర్ ఆఫీసర్, 8 మంది సిబ్బంది ఉన్నారు. అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాలతోపాటు టేక్మాల్, పాపన్నపేట మండలాల పరిధిలోని పలు గ్రామాలకు ఇక్కడి నుంచే ఫైర్ ఇంజన్ వెళ్లాల్సి ఉంది. పక్కా భవనం లేకపోవడంతో తాత్కాలిక భవనం ఏర్పాటు చేశారు. ఇందులో సరైన వసతులు కూడా లేకపోవడం, నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ఫైర్ ఇంజన్‌లో నీరు నింపాలంటే పంట పొలాల వద్దకు వెళ్లాల్సిందే. పక్కా భవనం తోపాటు నీటి వసతి కల్పించాలి.

డ్రైవర్ల కొరత..

సంగారెడ్డి టౌన్: జిల్లాలో మొత్తం ఐదు నియోజకవర్గాల్లో 6 ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గంలో రెండు , అందోల్ జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్ ఒక్కొక్కటి, పటాన్‌చెరు నియోజకవర్గంలో ఒక ఫైర్ స్టేషన్ ఉంది. ఐదు నియోజకవర్గాల్లో ఆరు ఫైర్ ఇంజన్లు, ఆరు బైక్‌లు ఉన్నాయి. జిల్లాలో 18 మంది డ్రైవర్ పోస్టులు ఉండగా ఆరుగురు విధుల్లో ఉన్నారు. 12 మంది రిక్రూమెంట్ జరిగినప్పటికీ కోర్టులో కేస్ పెండింగ్ ఉండడంతో విధుల్లో చేరలేదు. లీడింగ్ ఫైర్ మెన్లు 12 మంది ఉన్నారు. ఐదు నియోజకవర్గాల్లో నలుగురు ఫైర్ ఆఫీసర్లు విధుల్లో ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం ఆఫీసర్ ట్రైనింగ్‌లో ఉన్నాడు. ఒక స్టేషన్‌కు మొత్తం 16 మంది ఉంటారు. జిల్లాలో మూడేళ్ల నుంచి 1,433 ఫైర్ యాక్సిడెంట్ నమోదయ్యాయి. డ్రైవర్ల నియామకం చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వి.శ్రీనివాస్ అన్నారు.

కరువైన పక్కా భవనం



వనరుల శిక్షణ కేంద్రం భవనంలో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ఫైర్ స్టేషన్‌కు సరిపడా సిబ్బందితోపాటు అగ్నిమాపక యంత్రాలున్నప్పటికీ పక్కా భవనం లేదు. పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలో మినీ స్టేడియం సమీపంలో గతంలో రేకుల షెడ్డులో అగ్నిమాపక కేంద్రం కొనసాగింది. ఇక్కడ నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పక్కనే ఉన్న ప్రాంతీయస్థాయి జీవనోపాధుల వనరుల శిక్షణ కేంద్రం భవనంలోకి అగ్నిమాపక కేంద్రాన్ని మార్చారు.ఇక్కడ ఒక ఏడీఎఫ్‌వో, 1 ఎస్‌ఎఫ్‌వోతో పాటు నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, మరో 18 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా.. 2 పెద్ద అగ్నిమాపక యంత్రాలు, మరొకటి చిన్నయంత్రంతోపాటు 1 మిస్ట్ బుల్లెట్‌లు ఉన్నాయి.

ఆరు బయటే విధులు..

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ అగ్నిమాపక కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఫైర్ ఇంజన్ పాతది కావడంతో తరచూ మరమ్మతులు చేపడుతున్నారు. అగ్నిమాపక కేంద్రానికి పక్కా భవనం లేకపోవడంతో చాలీచాలని రేకుల షెడ్డులో ఇంజన్ ఉంచుతున్నారు. సిబ్బంది తలదాచుకోవడానికి సైతం భవనం లేకపోవడంతో ఆరుబయటే ఎండ, వాన, చలిలో విధులు నిర్వహిస్తున్నారు. అగ్నిమాపక కేంద్రానికి కేటాయించిన స్థలానికి చుట్టూ ప్రహరీ లేదు. మొత్తం 16 మంది సిబ్బందికి ఫైర్ ఆఫీసర్ 1, లీడింగ్ ఫైర్ మెన్ 1, 10 మంది హోంగార్డులతో అగ్నిమాపక కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతీ సోమవారం నుంచి శుక్రవారం వరకు ఫైర్ సిబ్బంది అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నిర్మాణంలో నూతన భవనం ..

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట అగ్నిమాపక కేంద్రం పరిధిలో సదాశివపేట మున్సిపాలిటీలోని 26 వార్డులు, మండలం పరిధిలోని 29 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పట్టణ మండల పరిధిలో అగ్ని ప్రమాదాల నివారణకు సిబ్బంది చర్యలు చేపడుతున్నా సిబ్బంది కొరత ఉంది. మొత్తం 16 మందికి 10 మంది సిబ్బంది ఉన్నారు. సదాశివపేట ప్రాంతం పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి జరుగుతున్నందున ఒక అగ్నిమా పక వాహనంతోపాటు సరిపడా సిబ్బందిని నియమించారు. ఓ పరిశ్రమ యాజమాన్యం అన్ని సౌకర్యాలతో అగ్నిమాపక భవనం నిర్మిస్తుంది.

రెండు చోట్ల ఒకేసారి జరిగితే భారీ నష్టం

సిద్దిపేటకమాన్: గతేదాది డిసెంబర్ 1వ తేదీన జిల్లా కేంద్రం సిద్దిపేట హౌజింగ్ బోర్డు కాలనీలోని కాకతీయ టెక్నో స్కూల్‌లోని ఓ గదిలో షార్ట్ సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ నుంచి మంటలు చెలరేగాయి. గదిలోని రైస్ కుక్కర్, ఏసీ, టీవీ, బీరువా, కుర్చీలకు వ్యాపించడంతో పొగతో కూడిన మంటలు వ్యాపించాయి. దీంతో పాఠశాల నిర్వాహకుడు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశాడు. వారు స్పందించకపోవడంతో అతడే స్వయంగా ఫైర్ స్టేషన్‌కు వెళ్లి సిబ్బందిని తీసుకొచ్చాడు.

కొత్తది ఏర్పాటు చేస్తేనే..

సిద్దిపేట ఫైర్ స్టేషన్ అందించే సేవల పరిధి బెజ్జంకి, చేర్యాల, నంగునూర్ వంటి ప్రాంతాల వరకు ఉండడంతో వేసవి కాలంలో రెండు ప్రాంతాల్లో ఒకేసారి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే సిబ్బంది వెళ్లలేని పరిస్థితి. దీంతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. సిద్దిపేట ఫైర్ స్టేషన్ 40 కిలోమీటర్ల వరకు సేవలు అందిస్తుంది. కాబట్టి సిద్దిపేటలో మరో ఫైర్ స్టేషన్ కానీ, చేర్యాల, బెజ్జంకి, నంగునూర్ ప్రాంతాల్లో ఏదో ఒక చోట ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు, పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సిద్దిపేట ఫైర్ స్టేషన్‌లో నీటి సదుపాయం లేకి మున్సిపల్ కార్యాలయానికి చెందిన బోరు నుంచి వాడుతున్నారు. ఇక్కడ 4,500 లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఒక వాటర్ టెండర్, ఒక ఈసుజీ వాహనం (విస్ట్ జీప్), ఒక బుల్లెట్ వాహనం అందుబాటులో ఉంది. ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ముగ్గురు డ్రైవర్లకు ఇద్దరు, 10 మంది ఫైర్ మెన్‌లకు 8 మంది ఉన్నారు.



సిద్దిపేట అగ్నిమాపక కేంద్రంలో వాహనాలు

ప్రతీ శుక్రవారం అవగాహన



పటాన్‌చెరు అగ్నిమాపక కేంద్రం

పటాన్‌చెరుటౌన్: ప్రతీ శుక్రవారం పటాన్‌చెరు ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో పరిశ్రమల్లో, విద్యా సంస్థల్లో, పెట్రోల్ బంకుల్లో, బస్టాండ్‌ల్లో అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రుల్లో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాల పై అవగాహన కల్పించి, వారికి డెమో చేసి చూపిస్తున్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై తగు జాగ్రత్తలు తీసుకుంటే అప్పుడే ప్రమాదాల బారి నుంచి బయటపడతారని అగ్నిమాపక అధికారి జన్య నాయక్ పేర్కొన్నారు. ఇక్కడ ఒక మల్టీపర్పస్ టెండర్ వాహనం, మిస్ట్ జీప్, మిస్టి బుల్లెట్ ఉన్నాయి. అగ్నిమాపక కేంద్రంలో 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌తో కలిపి 15 మంది ఉన్నారు. అందులో ఒకరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్, లీడింగ్ ఫైర్ మాన్ 2, డ్రైవర్ ఆపరేటర్లు 2, స్టాఫ్ 10 మంది ఉన్నారు.

చెరువు నీటిని నింపుకొని..



పంచాయితీరాజ్ గోడౌన్‌లో ఫైర్ ఇంజన్

నారాయణఖేడ్: ఖేడ్‌లోని అగ్నిమాపక కేంద్రం అవస్థల మధ్య కొనసాగుతుంది. 15 ఏళ్లుగా శిథిల భవనంలోనే కొనసాగుతుంది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ గోడౌన్‌లో కేంద్ర ఏర్పాటు చేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసి షెడ్డు కింద వాహనాన్ని నిలుపుతున్నారు. బోరు లేకపోవడంతో 5 కిలో మీటర్ల దూరంలో గల కమలాపూర్ చెరువు నుంచి నీటిని నింపుకొని వస్తున్నారు. వరుసగా ప్రమాద ఘటనలు జరిగితే బోరు లేని కారణంగా కమలాపూర్ చెరువు వద్దకు నీరును నింపుకొనేందుకు వెళ్లి వచ్చేలోపు కాలి బూడిద కావాల్సిందే. ముగ్గురు జమేదార్లకు గాను ఒక్కరే, 11 మంది ఫైర్‌మెన్లకు ఐదుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరు డ్రైవర్లు కూడా అవసరం ఉంది.

రక్షణ లేని ఫైర్ స్టేషన్



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో వ్యవసాయ మార్కెట్‌లోని రైతు మిత్ర భవనంలో అగ్రిమాపక కేంద్రం ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే కాలం వెళ్లదీస్తుంది. ఫైర్ స్టేషన్‌లో 10 మంది ఫైర్‌మెన్లు, ఇద్దరు ఎల్‌ఎఫ్ (హెడ్ కానిస్టేబుల్స్), ఒకరు ఫైర్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్, పార్ట్‌టైం స్వీపర్ ఉండాలి. ప్రస్తుతం 10 మంది ఫైర్‌మెన్ల స్థానంలో 13 మంది ఫైర్ హోంగార్డులు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్స్, ఇటీవలె ఫైర్ ఆఫీసర్‌ను నియమించగా, ప్రస్తుతం ఆయన ట్రైనింగ్‌లో ఉన్నారు. మార్కెట్ యార్డులో ఫైర్ స్టేషన్‌కు 10 గుంటల స్థలాన్ని కేటాయించారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూరు మండలాలతో పాటు భీమదేవరపల్లి మండలంలోని కొన్ని గ్రామాలు హుస్నాబాద్ ఫైర్ స్టేషన్‌లో పరిధిలోకి వస్తాయి. ఇక్కడ 9 వేల లీటర్ల సామర్థ్యం గల అగ్నిమాపక వాహనం ఉంది. నీటి సౌకర్యం లేక మున్సిపల్ బోరే దిక్కవుతుంది. 2022–2023 సంవత్సరానికి గాను 41 ఫైర్ కేసులు నమోదయ్యాయి.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి

సిద్దిపేటరూరల్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఇర్కోడ్ గ్రామానికి చెందిన మాట్ల వెంకటయ్య (80) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. చికిత్స చేయించినా తగ్గకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున వెంకటయ్య పురుగుల మందు తాగాడు. వెంటే కుమారుడు శ్రీనివాస్ సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తొగుట(దుబ్బాక): ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కాన్గల్ గ్రామానికి చెందిన ముత్తోల్ల కనకరాజు (27) అప్పుచేసి హోటల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. హోటల్ సరిగ్గా నడవకపోవంతో చేసిన అప్పులు తీర్చేమార్గంలేక మనస్తాపానికి గురై 1వతేదీన ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సిద్దిపేటఅర్బన్: జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం బూరుగపల్లి గ్రామానికి చెందిన జొంగోని సక్కుబాయి (55) అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన ఇరుగుపొరుగు వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్సకు హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి

మెదక్ మున్సిపాలిటీ: ట్రాక్టర్‌ను ఢీకొని హెల్త్ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన మెదక్ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన సుజీత్ (22) కొడిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలైన సుజీత్‌ను చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుంటామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



అబ్దుల్ పాషా(ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన అబ్దుల్ పాషా (35)కు అషుబేగంతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అబ్దుల్ ఐదేళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం మద్యం తాగి ఇంటికొచ్చి భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి ఇంటికొచ్చిన అబ్దుల్ మళ్లీ భార్యతో గొడవపడడంతో పిల్లలతో కలిసి ఆమె పక్క వాళ్ల ఇంట్లో నిద్రించింది. రాత్రి 11 గంటలకు అబ్దుల్ తన అక్క బీబీ ఫాతిమాకు ఫోన్ చేసి తాను చనిపోతున్నాను అని తెలిపాడు. వెంటనే ఆమె వదిన అషుబేగంకి చెప్పింది. భార్య, చుట్టు పక్కలవాళ్లతో కలిసి ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా అబ్దుల్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాయమాటలతో దోచేస్తున్నారు

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో పలువురు బాధితులు రూ. 4,91,281 డబ్బు లు ఆన్‌లైన్‌లో పంపి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మోసపోయారని సీపీ అనురాధ మంగళవారం తెలిపారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట

మద్దూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ లింకును పంపగా బాధితుడు లింకును ఓపెన్ చేసి వివరాలు నమోదు చేశాడు. అందులో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మిన బాధితుడు రూ.35,960 పంపించాడు. తర్వాత లింకు బ్లాక్ చేసి ఉంది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయగా ఖాతాలో ఉన్న రూ.7వేలు ఫ్రీజ్ చేశారు. అక్కన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి పార్ట్ టైం ఉద్యోగం అని నమ్మి పలు విడతలుగా రూ.2,90,000 పంపించి మోసపోయాడు.

సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ స్థలంలో ఐడియా సెల్ టవర్ ఇన్‌స్టాల్ చేస్తామని తెలిపాడు. అగ్రిమెంట్ చేసుకుందామని ఆధార్, ఇతర వివరాలు పంపించాలని సూచించాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.22,700 పంపించి మోసపోయాడు.

హౌజింగ్ లోన్ పేరుతో..

బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తక్కువ వడ్డీతో రూ.5లక్షల హౌజింగ్ లోన్ మంజూరైనట్లు తెలిపాడు. లోన్ డబ్బులు ఖాతాలో జమ కావాలంటే ముందుగా జీఎస్టీ, ఇతర ప్రాసెసింగ్ చార్జీల కోసం డబ్బులు పంపించాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు రూ.1,42,621 పంపించాడు. అనతరం తాను తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రూ.25.71 లక్షలు పోగొట్టుకున్న అడ్వకేట్

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన అడ్వకేట్ జనవరి 8వ తేదీన ట్రేడింగ్ కు సంబంధించిన రాగా తన వివరాలు నమోదు చేశారు. పెట్టిన నగదుతోపాటు లాభాలు వస్తాయని చెప్పడంతో బాధితుడు పలు దఫాలుగా రూ.25 లక్షల 71 వేలు పంపించాడు. అనంతరం అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. బాధితులు తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రూ.15 లక్షల 37 వేలు

అమీన్‌పూర్ పరిధిలో ఓ ప్రైవేటు ఉద్యోగి జనవరి 15వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్‌కి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించాడు. తర్వాత పలు దఫాలుగా బాధితుడు మొత్తం రూ.15 లక్షల 37 వేలు చెల్లించాడు. ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదు తో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.